ఉద్యోగ విరమణ



రామంతాపూర్‌: ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రి సెర్ఫ్‌ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్‌ శ్రీదేవి పదవీ విరమణ కార్యక్రమాన్ని సోమవారం ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి దంపతులను ఆయుష్‌ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ లింగరాజు ఘనంగా సత్కరించారు. హోమియో వైద్య కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ విజయ, ఫార్మసీ ఇన్‌చార్జి డాక్టర్‌ రామచందర్‌, తెలంగాణ హోమియో వైద్యుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్‌ పార్థసారథి, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

మల్లాపూర్‌: నాచారం పారిశ్రామికవాడలోని ఆరిజన్‌ కంపెనీ స్క్రాప్‌ గొడౌన్‌లో సోమవారం ఉదయం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగరావడంతో చుట్టు పక్కలవారు ఆందోళనకు గురయ్యారు. హుటాహుటిన ఘటనా స్థలానికి ఫైర్‌ ఇంజన్లు చేరుకుని సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



కుమార్తెతో శివలీల ,కుమారులు

మేడిపల్లి: ముగ్గురు పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న రాముడు భార్య శివలీల (25)కుమార్తె, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటూ.. స్థానికంగా కూలీపని చేస్తున్నాడు. కాగా ఈనెల 23న ఉదయం భర్త పని కోసం వెళ్లగానే భార్య ముగ్గురు పిల్లలతో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త సోమవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటస్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్‌: పేకాట స్థావరంపై పేట్‌బషీరాబాద్‌ పోలీసులు దాడులు చేసి 8 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లిలోని స్కైలీవ్‌ అపార్ట్‌మెంట్‌లో పేకాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో అడ్డాపై దాడులు నిర్వహించారు. 8 మంది పేకాడుతూ పట్టుబడగా వారి నుంచి రూ.27,600, ఆన్‌లైన్‌లో రూ.19,200 నగదుతో పాటు 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి వారిని స్టేషన్‌కు తరలించారు.

'విద్యార్థుల అరెస్టు అన్యాయం'

ఆల్విన్‌కాలనీ: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు వీరమల్ల కేశవరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1974లో 2300 ఎకరాల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయం స్థాపించారన్నారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలుకు కావాల్సిన నిధులు సమకూర్చేందుకు ఈ యూనివర్సిటీ భూములు విక్రయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భూముల విక్రయాన్ని శేరిలింగంపల్లి ప్రజలు, విద్యార్థులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని, వారికి అండగా పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నిజాంపేట్‌: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కొలన్‌ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత వారం జర్నలిస్ట్‌ కాలనీ మారుతీ ఎలైట్‌ వాసులు కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈమేరకు సోమవారం కాలనీలో పర్యటించారు. కమిషనర్‌తో మాట్లాడి స్థానిక సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు కొలన్‌ శ్రీనివాస్‌రెడ్డి, నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు కొలన్‌ రాజశేఖర్‌రెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ టేకుల ప్రవీణ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, కుమార్‌యాదవ్‌, పితాని శ్రీనివాస్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

టార్గెట్‌కు మించి ఆస్తి పన్ను వసూళ్లు

కుత్బుల్లాపూర్‌: ఆస్తి పన్ను వసూళ్లలో కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ కొత్త రికార్డు సృష్టించింది. టార్గెట్‌కు మించి రూ.2.84 కోట్ల ఆదాయం అదనంగా వసూలైంది. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ 2023–24 ఆస్తి పన్ను రూ.51.61 కోట్లు ఉండగా, 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.54.36 కోట్లుగా నిర్ణయించారు. అయితే బకాయిలతో కలిసి అంచనాలకు మించి లక్ష్యానికి అదనంగా రూ.2.84 కోట్లు వసూలై రూ.57,20 కోట్లకు చేరింది.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



హెచ్‌బీకాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ ప్రభుదాస్‌



కాప్రా ఈద్గాలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

భక్తి శ్రద్ధలతో రంజాన్‌



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత్‌రావు

ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ పరిధిలో ఈద్‌–ఉల్‌–ఫితర్‌ (రంజాన్‌)ను ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం రామంతాపూర్‌, ఉప్పల్‌, మల్లాపూర్‌, కుషాయిగూడ, మల్కాజిగిరి, అల్వాల్‌, మౌలాలి, కాప్రా తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల్లో భక్తి శ్రద్ధలతో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు.

– ఉప్పల్‌, మల్కాజిగిరి జోన్‌ బృందం



రామంతాపూర్‌ ప్రధాన రహదారిలోని మసీదులో..



కార్పొరేటర్‌ రజిత నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ పరమేశ్వర్‌రెడ్డి



చిలుకానగర్‌ ఈద్గా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న బన్నాల ప్రవీణ్‌



నాచారం ఎస్‌ఫ్‌ గార్డెన్‌లో..



ఇమామ్‌ అబుల్‌హాసన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



రంజాన్‌ వేడుకల్లో మాజీ కార్పొరేటర్‌ వెంకటేష్‌యాదవ్‌



మల్లాపూర్‌ ఈద్గాలో ఎండీ ఉస్మాన్‌ తదితరులు

రాష్ట్రానికి స్థానికత ఉద్యోగులను రప్పించాలి

మల్కాజిగిరి: తెలంగాణ స్థానికత ఉండి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రాష్ట్రానికి రప్పించాలని తెలంగాణ, ఏపీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు డాక్టర్‌ శ్రీనివాస్‌, లక్ష్మీనారాయణ, సుధాకర్‌ మాట్లాడుతూ.. జిల్లా, మల్టీజోనల్‌, జోనల్‌ స్థాయిలో అంతర్రాష్ట్ర బదిలీలు జరిగిన తర్వాత మిగిలిన ఖాళీలను ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగులను రప్పించేందుకు సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కోరామన్నారు. గత 11 ఏళ్లుగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా సమస్య పరిష్కారం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు రాష్ట్రాల చీఫ్‌ సెక్రటరీలు, జీవోలు జారీచేశారని సీఎం చొరవ చూపితే సమస్య పరిష్కారమవుతుందన్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంతో ఉద్యోగుల సంఘం నాయకులు

పేదలకు చీరల పంపిణీ

ఉప్పల్‌: రంజాన్‌ పర్వదినం సందర్భంగా మదర్‌ వలి పేదలకు చీరలను పంపిణీ చేశారు. ఉప్పల్‌ మాజీ చైర్మన్‌ మేకల శివారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు మురళీగౌడ్‌, వినోద్‌ముదిరాజ్‌, మదర్‌ వలి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



అ'పూర్వ' కలయిక



శ్రీనివాసపురంలోని ఆనంద్‌ జ్యోతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం కమ్యూనిటీహాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న పూర్వ విద్యార్థులకు శివరత్న అవార్డులు ప్రదానం చేశారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్‌ జడ్జి ప్రదీప్‌నాయక్‌, కార్పొరేటర్లు చేతనాశ్రీవాణి, కనిగిరి సత్యనారాయణ, గాదె సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

– రామంతాపూర్‌

'రాజీవ్‌ యువ వికాసం'@ 15,500 దరఖాస్తులు

ఉప ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్‌ కలెక్టర్‌ గౌతమ్‌



సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్‌ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. హైదరాబాద్‌ నుంచి రాజీవ్‌ యువ వికాసం పథకంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ గౌతమ్‌ మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డుల వారీగా ప్రజాపాలన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మేడ్చల్‌ జిల్లాలో రాజీవ్‌ యువ వికాసం పథకం కింద ఇప్పటి వరకు 15,500పైగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్‌ అయ్యాయని తెలిపారు. మూడు రోజులు వరుస సెలవులు వచ్చినందున గడువు ముగింపు తేదీ పెంచాలని కోరారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో రాజీవ్‌ యువ వికాసం పథకానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే విధంగా యువతను ప్రోత్సహించే విధంగా సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో రాజీవ్‌ యువ వికాసం పథకానికి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్‌ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనుకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఏప్రిల్‌–5లోపు దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలన్నారు.

ఇక రేషన్‌షాపుల్లో సన్న బియ్యం!

- బాలానగర్‌ సర్కిల్‌ పరిధిలో నేటి నుంచే పంపిణీ ప్రారంభం
- మొత్తం 2,04,433 రేషన్‌ కార్డుదారులకు లబ్ధి

కుత్బుల్లాపూర్‌: అధికారంలోకి వస్తే సన్నబియ్యం ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరే సమయం ఆసన్నమైంది. ఉగాది రోజున సీఎం రేవంత్‌ రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఈనెల 1 నుంచి అన్ని రేషన్‌ షాపుల్లో పంపిణీ చేసేందుకు 50 క్వింటాళ్ల చొప్పున ప్రతి దుకాణంలో అందుబాటులో ఉంచారు. బాలానగర్‌ సర్కిల్‌ పరిధిలో కుత్బుల్లాపూర్‌, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 121, 122 ,123, 124 వార్డులు రాగా ఇక్కడ మొత్తం 33 రేషన్‌ దుకాణాలు ఉన్నాయి. అదేవిధంగా కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 114, 115, 116, 117, 118, 119, 120 డివిజన్లు రాగా 83 రేషన్‌ దుకాణాలు, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గపరిధిలో 125, 126, 127, 128, 129, 130 ,131, 132 ,133 మొత్తం 8 డివిజన్‌లో 110 రేషన్‌ షాపులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

1,65,865 కిలోల బియ్యం పంపిణీ

బాలానగర్‌ డివిజన్‌ పరిధిలో మొత్తం 2,04,433 రేషన్‌ కార్డుదారులు ఉండగా, 1,65,865 కిలోల సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పౌర సరఫరాల శాఖ అధికారులు 50 క్వింటాళ్ల చొప్పున బియ్యాన్ని ఆయా దుకాణాలకు సరఫరా చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. డీలర్లకు పలు సూచనలు చేసి ఏమైనా ఆరోపణలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడుగడుగునా సమస్యల కొలిమి !

ప్రతిరోజూ సమస్యలతో సతమతం అవుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, కనీసం స్థానిక నాయకులైనా దృష్టి సారించి తమ సమస్యలను పరిష్కరించాలని పలు కాలనీలు, బస్తీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– రామంతాపూర్‌



వ్యర్థాలతో నిండిపోయిన చిన్న చెరువు

- అధ్వానంగా రోడ్లు.. దుర్గంధభరితంగా చెరువు
- వ్యర్థాలను తొలగించకుండా కాలుస్తున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గుంతలమయంగా రోడ్లు

రామంతాపూర్‌ నెహ్రూనగర్‌ నుంచి మొదలుకుని ఏడీఆర్‌ఎం ఆసుపత్రి, ఓల్డ్‌ రామంతాపూర్‌ వరకు ప్రధాన రహదారిలోని రోడ్లు ఛిద్రమై గుంతలమయంగా మారాయి. దీంతో ఈ రహదారి ద్వారా వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు పట్టించుకుని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రోడ్లు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతున్న చెరువు

రామంతాపూర్‌లోని పలు బస్తీలు, కాలనీల మధ్య ఉన్న చిన్న చెరువులో చెత్త,చెదారంతో పాటు గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. ఈ చెరువులోకి నిరంతరంగా డ్రైనేజీ మురుగు వచ్చి చేరడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చెరువు చుట్టూ పక్కల నివసించే బస్తీలు, కాలనీవాసులు అనారోగ్యం పాలవుతున్నారు. వెంటనే చెరువును శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తతో ముప్పు..

రామంతాపూర్‌ పక్కనే ఉప్పల్‌ హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో చాలా మంది స్థానికులు ఉదయం నడకకు వెళ్తుంటారు. అయితే ఈ ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేసి వ్యర్థాలను స్వచ్ఛ వాహనాల ద్వారా ఎత్తేయాలి. కానీ అలాంటివేమీ చేయకుండా ఒకేచోట చెత్తను కుప్పలుగా పోసి కాలుస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. దట్టమైన పొగల కారణంగా ఉదయం నడకకు వచ్చే వారితో పాటు స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వాగ్వివాదానికి దిగుతున్న వైనం..

వ్యర్థాలను కాలుస్తుంటే పర్యవేక్షకులు ప్రశ్నిస్తే 'ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో.. చేసుకోండి' అని స్థానికులతో వాగ్వివాదానికి దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు దీనిపై చొరవ తీసుకుని వ్యర్థాలను కాల్చకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వారు.. వదిలేశారు..

రామంతాపూర్‌ శ్రీనివాసపురంలో రూ.34 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. దీని కోసం రహదారులను తవ్వేసి పనులు పాక్షికంగా చేపట్టి వదిలేశారు. 45 రోజులైనా రోడ్డు పనులు ఇంకా పూర్తి చేయకపోవడంతో స్థానికులు తమ ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పూర్తిచేయాలని కోరుతున్నారు.



చెత్తను కాలుస్తున్న దృశ్యం



తవ్వి వదిలేసిన రోడ్డు